విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 4,ఆగస్టు 2025

సీపీఐ పట్టణ మహాసభలను జయప్రదం చేయండి

- రాష్ట్ర మహాసభల్లో ఎన్డీఏకు రాజకీయ ప్రత్యామ్నాయం దిశగా చర్చిస్తాం..
- సిపిఐ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు డి.జగదీష్

విశాలాంధ్ర-గుంతకల్లు : ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న సిపిఐ పట్టణ మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు డి.జగదీష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు మహాసభలు జరుపుకొని పార్టీ చేసిన కార్యక్రమాలను సమీక్షించుకుని మరల రానున్న మూడు సంవత్సరాలకు అనుసరించే రాజకీయ విధానాలు రూపొందించుకొని నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటుందన్నారు. రాష్ట్ర మహాసభలు ఒంగోలులో 23, 25, 26 తేదీల్లో జరుగుతాయి, అన్ని రాష్ట్ర మహాసభలు జరిగిన తర్వాత చండీగర్‌లో జాతీయస్థాయి మహాసభలు సెప్టెంబర్ లో 22 నుంచి 25 నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రాజకీయ ప్రజా దోపిడీని ఎండగట్ట డానికి సిపిఐ పార్టీ అహర్నిశలు ప్రజలపక్షాన ఉంటూ పోరా టాలు చేస్తుందని అన్నారు. ఈనెల తొమ్మిదో తేదీన గుంతకల్ మున్సిపల్ కార్యాలయం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు వేలాది మంది కార్యకర్తలతో ర్యాలీ చేస్తామని, అనంతరం పాత బస్టాండ్‌లో బహిరంగ సభ జరుగుతుందని అన్నారు. ఈ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జగదీష్, ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోడీ చేసే రాజకీయ కుట్రలను ఎదుర్కోవడానికి ఎటువంటి విధానాలను ఏర్పాటు చేయాలన్న విధానాలపై చర్చిస్తామని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలో గెలవడానికి అధికార బలంతో ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేస్తూ, ఈవీఎంల ట్యాంపరింగ్, రిగ్గింగ్ లాంటి కుతంత్రంతో ఓటర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం డబ్బును ఎరవేయడం వంటి అప్రజాస్వామిక విధానాలతో ప్రజాస్వామ్యాన్ని మంట కలుపుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలు అమలుచేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. టిడిపికి మెజార్టీ ఉన్నప్పటికీ రాష్ట్ర హక్కులను సాధించుకోవడంలో విఫలమై నరేంద్ర మోడీతో కాళ్లబేరం చేస్తున్నారని అన్నారు. విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధిస్తూ ప్రజా సంఘాల స్వాతంత్రాన్ని హరిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో రైతు, కార్మికుల, ఉద్యో గుల, సమస్యలు పట్టించుకోకుండా కార్పొరేట్లకు ఊడిగం చేస్తుందని మండిపడ్డారు పేదవాడికి సెంటు స్థలం ఇవ్వడానికి అనేక ఇక్కట్లు పాలు చేస్తున్న ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు కేవలం ఎకరాకు 99 పైసలుతో వందల ఎకరాలు అందిస్తున్నాయని అన్నారు. భూమి, నీరు ,సహజ వనరులు అన్ని కూడా కార్పొరేట్ సంస్థలకు దార దత్తం చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. టిడిపి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఎన్నో ప్రచారాలు చేసి స్మార్ట్ మీటర్ల ధ్వంసానికి కూడా పాల్పడ్డారని అన్నారు. అంతటితో ఆగకుండా వాటికి వ్యతిరేకంగా ప్రస్తుత మంత్రి పయ్యావుల కేశవ్, కోర్టులో కూడా కేసు వేశారని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ద్వంద వైఖరి అవలంబిస్తూ స్మార్ట్ మీటర్లను ఇళ్ళకు వేగవంతంగా తగిలించి అధిక బిల్లులను వసూలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రానికి ప్రధానమైనటువంటి పోలవరం ప్రాజెక్టు 41 అడుగులకు తగ్గిస్తూ రాయలసీమకి అన్యాయం చేసే ప్రయత్నం జరుగుతుందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలు ప్రకటించి వాటిని అమలు చేయడంలో టిడిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలపైన ప్రజా సమస్యల పరిష్కరించటం కోసం రాజకీయ వ్యూహాలను ఎదుర్కోవడానికి కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి గోవిందు, సిపిఐ డివిజన్ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి బి మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్.,గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎన్ఎండి గౌస్, సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్, తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజా రక్షణ కోసం జనసేవా దళం

సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం : దేశ ప్రజా రక్షణ కోసం జనసేవా దళం స్థాపించబడిందని సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ జాఫర్ పేర్కొన్నారు. సీపీఐ అనంతపురం నగర సమితి ఆధ్వర్యంలో జనసేవాదళ్ శిక్షణ శిబిరం ఘనంగా నిర్వహించారు.. వందలాది మంది యువకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్న ఈ శిక్షణ శిబిరం, పార్టీ ప్రజా సేవా ఆలోచనలకు జీవం పోసే విధంగా సాగింది. ఈ శిబిరానికి సీపీఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు అధ్యక్షత వహించగా, శిక్షణను రాష్ట్ర ఇన్స్ట్రక్టర్ వి.జాన్సన్‌బాబు, సీనియర్ జనసేవాదళ్ నేత కే.వై.ప్రసాద్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.సంతోష్ కుమార్, జిల్లా ఇన్స్ట్రక్టర్లు ఎస్.రమణ, ఎం.ఆనంద్ నిర్వహించారు. ముఖ్య అతిథి సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ శిబిరాన్ని ప్రారంభించి జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ స్వార్థరహిత ప్రజా సేవకు జీవితాన్ని అంకిత మిచ్చిన కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు జీవితం మనందరికీ స్ఫూర్తి అన్నారు. ఆయన స్థాపించిన జనసేవా దళం నేడు ప్రజల సమస్యలపై స్పందించే ఒక శక్తివంతమైన వేదికగా మారిందన్నారు. శ్రమ జీవుల సమస్యలపై స్పందన, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఆరోగ్య, రక్తదాన శిబిరాలు, పారిశుద్ధ్య, సామాజిక చైతన్య కార్యక్రమాలతో "రాజకీయంతో పాటు ప్రజల మధ్య సామాజిక బాధ్యతతో పనిచేయాలన్న ఆశయంతో జనసేవా దళ్ స్థాపించా మన్నారు. సేవే సమాజాన్ని మార్చే మార్గం అన్నారు. ప్రతి వీధిలో, ప్రతి వార్డులో ప్రజల సమస్యలపై స్పందించే బృందంగా ఎదగాలన్నారు. యువత దీనిలో చురుకుగా భాగస్వాములు కావాలని, "ఈనెల 12,13వ తేదీల్లో జరగనున్న అనంతపురం సిపిఐ జిల్లా మహాసభల్లో పెద్దఎత్తున జనసేవ ఎర్రదళం వాలంటీర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు: లింగమయ్య, పద్మావతి, బి.రమణ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయి స్వామి, సీపీఐ నగర సహాయ కార్యదర్శి: వి.కృష్ణుడు, నగర నాయకులు, అల్లిపిరా, ఎల్లుట్ల నారాయణస్వామి, జానకి, జయలక్ష్మి, చంద్‌భాష, గదిలింగప్ప, రాజు, రహంతుల్లా, ఏఐవైఎఫ్ నగర కార్యదరి శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మంజునాథ్,సీపీఐ నగర సమితి సభ్యులు: మున్న, ప్రసాద్, అడ్వకేట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాలనీ వాసుల దాహార్తిని తీర్చిన మాజీ ఎంపీపీ

విశాలాంధ్ర-యాడికి : మండల పరిధిలో రాయల చెరువు గ్రామంలో ఎన్టీఆర్ కాలనీ, కొత్త కొట్టాలు కాలనీ, హై స్కూల్ కాలనీ గత కొద్దిరోజుల నుండి తాగునీటి సమస్యతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఆదివారం మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య దృష్టికి తీసుకురాగా తాగునీటి ట్యాంకర్ల ద్వారా కాలనీ వాసుల దాహార్తిని తీర్చారు.

చర్లపల్లిలో గ్రామసభ

విశాలాంధ్ర-డి.హీరేహాళ్ : మండలంలోని చర్లపల్లి గ్రామంలో ఆదివారం రూరల్ సీఐ వెంకటరమణ ఆధ్వర్యంలో ఎస్సై గురు ప్రసాద్ రెడ్డి గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు సైబర్ నేరాలు, పోక్సో చట్టాలు, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామంలో 2016లో జరిగిన హత్య కేసులో యావజ్జీవ శిక్ష అనుభవించి ఇటీవల విడుదలై వచ్చిన రౌడీషీటర్‌కి కౌన్సెలింగ్ ఇచ్చి సత్ప్రవర్తనతో మెలగాలని హితవు పలికారు.

యూరియా కోసం రైతుల తీవ్ర అగచాట్లు

విశాలాంధ్ర-రాయదుర్గం : చిన్న సన్నకారు రైతులు యూరియా కోసం తీవ్ర అగచాట్లు ఎదుర్కొంటున్నారని నియోజకవర్గ తాలూకా ఏపీ రైతు సంఘం కార్యదర్శి తిప్పేస్వామి అన్నారు. ఆదివారం రాయదుర్గం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో... నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయని మండిపడ్డారు. రైతులే దేశానికి వెన్నుముక చెప్పుకుంటున్న పాలకులు రైతులకు కనీసం ఎరువులు పంపిణీ చేయడంలో ఘోరంగా విఫలమయ్యా రన్నారు. నియోజవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో రైతులు బోరు బావులు వద్ద వివిధ పంటలైన వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, రాగి, వరి, తదితర పంటల సాగు కోసం రైతుల అష్ట కష్టాలు పడి పంటలు సాగు చేస్తే పంటల దిగుబడికి వేసే యూరియా, డిఏపి తదితర మందులు రైతు భరోసా కేంద్రాలలో గ్రామ సొసైటీలలో చిన్న సన్నకార రైతులకు అందజేయకుండా వారికి అనుకూలమైన వారికే 10 ప్యాకెట్స్ మొదలుకొని వారికి అడిగినంత యూరియాను అందజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా డీఏపీ ప్రతి సంవత్సరం వచ్చే సరుకు కంటే ఈసారి మించి వచ్చిందని అధికారులు తెలియజేస్తున్నారు. అయినా అవి ఎవరి వద్ద ఉన్నాయో అర్థం కావడం లేదన్నారు. రైతులు ఓ ప్రక్క పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతుంటే మరో పక్క ఎరువుల కొరతతో అష్టకష్టాలు పడుతున్నారని, దాదాపు నెలపైగా ఎరువుల కోసం ఆధార్ కార్డులతో కార్యాలయం చుట్టూ తిరిగిన నో అని చెప్పడం సబబు కాదన్నారు.. ఇదే అదునుగా భావించిన ఫర్టిలైజర్ షాప్స్ యజమానులు యూరియాను అధిక ధరలతో రైతులకు విక్రయిస్తున్నారని మండిపడ్డారు.. యూరియా ఎరువులు సరైన సమయంలో పంపిణీ చేయకపోతే పంట దిగుబడి తగ్గి రైతు తీవ్రంగా నష్టపోతాడన్నారు. అప్పులు ఎలా తీర్చలో అర్థం కాక ఆత్మహత్యలే శరణమని రైతులు తమ బాధను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రైతుల కష్టాలను గుర్తించి రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సొసైటీల ద్వారా ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, నాగయ్య, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

- పోస్టు కార్డు ఉద్యమం
- ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామకృష్ణ ..

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం కోసం జిల్లా వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన కార్మికులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు పోస్టుకార్డుల ద్వారా సమస్యను తీసుకెళ్తున్నట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌లకు రాసిన పోస్టుకార్డులను భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులతో కలసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జివో నెం. 1214 ప్రవేశపెట్టి సంక్షేమ బోర్డులో ఉన్న రూ.1200 కోట్లు ప్రభుత్వం అవసరాలకు మళ్లించి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. 2024 ఎన్నికల ముందు కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండిరగ్‌లో ఉన్న క్లైములను పరిష్కరిస్తామని నిధులు మంజూరు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి కార్మికులతో ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికి కూటమి పాలన 13 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీని మేరకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించకుండా విస్మరించిందని వెంటనే హామీని అమలు చేయాలని వారు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మన్న, ఉపాధ్యక్షులు వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థుల హక్కులను కాలరాసే జీఓపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతాం

ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం : విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులను ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి హనుమంతురాయుడు, కుల్లాయి స్వామి తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రకటించారు. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓను నిరసిస్తూ అనంతపురం నగరంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆదివారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టి ఉత్తర్వులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా హనుమంత రాయుడు, కుల్లాయిస్వామిలు మాట్లాడుతూ విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యారంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. విద్యాసంస్థలలో విద్యార్థుల సమస్యలు బయటకు రానీయకుండా అనగదొక్కేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవో తీసుకువచ్చిందని మండిపడ్డారు. గతంలో చంద్రబాబు నాయుడు పాలనలోనే కాలేజీ విద్యార్థి సంఘాల ఎన్నికలను రద్దు చేసిందని,, ఇది పిరికి పంది చర్యగా అని తీవ్ర స్థాయిలో విరుచుకు పడ్డారు. జీవో తీసుకువచ్చి అవినీతి అక్రమాలను పెంచి పోషిస్తుందని రాష్ట్ర ప్రభుత్వంపైన మండిపడ్డారు. రాష్ట్రంలో నేడు చాలా ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రభుత్వ హాస్టల్లో ప్రభుత్వ గురుకుల కేజీబీవీ మోడల్ స్కూల్లో ఏర్పాటు చేశారంటే విద్యార్థి సంఘాల నాయకులు చేసిన పోరాటమే అని పేర్కొన్నారు. నేడు ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న చాలామంది ప్రజాప్రతినిధులు గతంలో తమ బాల్యంలో విద్యార్థి నాయకులుగా పనిచేసే విద్యార్థుల సమస్యల కోసం పోరాటం చేసిన విషయాన్ని మీరు మర్చిపోయారా అని ప్రశ్నించారు. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, ప్రజా జీవితంపై అవగాహన హక్కులు బాధ్యతలను విద్యార్థి సంఘాలు తెలియచేస్తాయని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన విద్యార్థి ఉద్యమాలు చెప్పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు మంజునాథ్ నగర కోశాధికారి నాని సహాయ కార్యదర్శి సమీర్ నాయకులు తరుణ్ కార్తీక్, అక్బర్, సురేష్, యశ్వంత్, ఉమేష్, భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే విద్యార్థి గొంతుకకు ఉరితాడు

విశాలాంధ్ర-గుంతకల్లు : విద్యా సంస్థలలో విద్యార్థి సంఘాల నాయకులకు అనుమతి లేదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట నాయక్ అన్నారు. ప్రశ్నించే విద్యార్థి గొంతుకకు ఉరితాడు వేస్తున్నారన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తూ ఆదివారం అజంతా సర్కిల్లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్ నాయక్ మాట్లాడుతూ అన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, విద్యార్థుల హక్కుల కోసం విద్యారంగంలో ఉన్న అక్రమాలపై పోరాటాలు చేస్తున్న విద్యార్థి సంఘాలను అణుణదొక్కేలా కూటమి ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందన్నారు. ప్రధానంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలన్నీ కూటమి ప్రభుత్వ నాయకులవేనని.. శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం, ఈ పాఠశాలల ఫీజుల దోపిడీని పుస్తకాలను అధిక ధరలు అమ్ముకోవడానికీ, విద్యను వ్యాపారం చేసుకోవడానికి వారి మేలు కోసమే ఉత్తర్వులని అన్నారు. ఉత్తర్వులు తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన విద్యార్థి ఐక్య ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు రోహిత్ పట్టణ సహాయ కార్యదర్శి ఫర్హన్ ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు శంకరప్ప ప్రవీణ్ రంజిత్‌నాయక్, వంశీ, మల్లీజర్జున, ప్రవీణ్ నాయక్, రియాజ్, పందు, అంజి, అనిల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విరుద్ధం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులను ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు ఖండించారు. ఆదివారం కళ్యాణదుర్గం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఉత్తర్వులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా హనుమంత రాయుడు మాట్లాడుతూ, విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యా రంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ తాలూకు ఉపాధ్యక్షుడు మురళి, హర్షవర్ధన్, సహాయ కార్యదర్శి రజని, రఘు, నందకిషోర్, గోపి నాయకులు విష్ణు, కళ్యాణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర-ఉరవకొండ: స్థానిక కరి బసవ స్వామి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో ఆదివారం 2001-2002 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మే ళనం నిర్వహించారు. సుమారు 23 సంవత్సరాల తర్వాత అందరూ ఒక వేదికపై వచ్చి గతస్మృతులను నెమరవేసుకున్నారు. ఉద్యోగ, వ్యాపారరీత్యా ఎక్కడెక్కడో స్థిరపడి వాళ్లు కూడా దశాబ్దాల తర్వాత కలవడంతో ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని తన్మయత్వంలో మునిగి తేలారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఆక్సిజన్ సరఫరా పరికరం వితరణ

విశాలాంధ్ర-తాడిపత్రి : కార్పెంటర్ కుటుంబానికి ఆదివారం ఆక్సిజన్ సరఫరా పరికరం వితరణ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కిషోర్ కుమార్ చెప్పారు. పట్టణంలోని చిన్న బజార్, బుధవారం అమ్మయ్య గుడి సమీపంలో ఉన్న దాదాపీర్ అనే కార్పెంటర్ తల్లికి ఆక్సిజన్ సరఫరా పరికరం లేక ప్రతిరోజు 500 రూపాయలు వరకు ఆక్సిజన్ సిలిండర్ బయట నుంచి తీసుకుని వచ్చి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుండగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 35 వేలు విలువచేసే ఆక్సిజన్ సరఫరా పరికరం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు మద్దిలేటయ్య, మురుగన్ బాల సుబ్రమణ్యం, షాకీర్ భాష, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ప్రతిఘటిస్తాం..

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : తిమ్మసముద్రం ఇండస్ట్రియల్ పార్క్ ప్రారంభోత్సవాలకే పరిమితమైం దని, ఉపాధి లేని సోలార్ లాంటి ప్రాజెక్టులకు ఏపీఐఐసి భూమి కట్టపెడితే రైతులతో కలిసి తీవ్రంగా ప్రతిఘటిస్తామని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ హెచ్చరించారు. ఆదివారం కళ్యాణదుర్గం మండలం మానిరేవులో జరిగిన రూరల్ మండల మహాసభకు సహాయ కార్యదర్శి నరసింహులు, మండల కార్యదర్శి ఆంజనేయులు, బ్రహ్మసముద్రం మండల కార్యదర్శి నాగరాజు నాయక్ నాయకులు వెంకటేశులు రాయక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ రైతులు ఉపాధి కల్పించే పరిశ్రమలు వస్తాయని 1100 ఎకరాలు భూమిని ఏపీఐఐసీకి ఇచ్చారన్నారు. పాలకవర్గాల నిర్లక్ష్యంతో ఇంతవరకు ఉపాధి పరిశ్రమలు ఏర్పడక పోవడం దురదృష్టం అన్నారు. పేరూరు ప్రాజెక్టుకు హంద్రీ నీవా నీరు తీసుకురావడంలో పాలకవర్గాలు విఫలమైనాయి అన్నారు. పెన్నానదిలో నీరు లేకపోవడం వలన భూగర్భ జలాలు తగ్గి పరివాహక ప్రాంతంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. వర్షా బావ పరిస్థితులు వలన పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ బిల్లులు కూలీలకు తక్షణం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మండలంలో అధ్వానంగా ఉన్న రోడ్లను తక్షణం వేయాలని అన్నారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, గురుస్వామి, రామాంజి ఎల్లప్ప, మల్లేష్ శ్రీనివాసులు నాయక్, పెదయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ..

మండల కార్యదర్శిగా ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా వెంకటేశులు, శ్రీనివాసులు నాయక్ 11 మంది కార్యవర్గ సభ్యులుగా 19 మంది కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీటివంగా ఎన్నుకోవడం జరిగింది.

ప్రజా సమస్యల పరిష్కారం కమ్యూనిస్టులతోనే సాధ్యం

ఎన్నికల హామీలు అమలులో విఫలం.. నియోజకవర్గ మహాసభలో నేతలు

విశాలాంధ్ర-తాడిపత్రి : ప్రజా సమస్యల పరిష్కారం కమ్యూనిస్టులతోనే సాధ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, తాడిపత్రి నియోజకవర్గ ఇంచార్జ్ రాజారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి వద్ద ఉన్న రజక ఫంక్షన్ హాల్లో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య ఆధ్వర్యంలో 16వ నియోజకవర్గ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, సిపిఐ సీనియర్ నాయకులు పెద్దవడుగూరు సూర్యనారాయణరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి సిపిఐ తాడిపత్రి నియోజకవర్గ సహాయ కార్యదర్శి వెంకట్ రాముడు యాదవ్ పాల్గొన్నారు. మొదటగా పోలీస్ స్టేషన్ సర్కిల్ నుండి రజక ఫంక్షన్ హాల్ వరకు ఎర్రజెండాలు చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజక వర్గ మహాసభలు నియోజకవర్గ కార్యదర్శి టి.రంగయ్య అధ్యక్షతన మొదలయ్యాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ, దేశంలో ప్రతి సంస్థలను కార్పొరేట్లకు అప్పజెప్పి, కార్పొరేట్లకు కొమ్ము కాస్తోం దన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారం లోకి రాక మునుపు విద్యుత్ చార్జీలు జగన్ ప్రభుత్వం పెంచుతూ పోతుందని, తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచం, స్మార్ట్ మీటర్లు బిగించమని ఆనాడు చెప్పాడు. తీరా అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేస్తున్నా రన్నారు. అలాగే జగన్ ప్రభుత్వం పేదలకు ఒక సెంటు స్థలం ఇచ్చాడు. ఆ స్థలము పేదలకు సరిపోదని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణంలో రెండు సెంట్లు గ్రామాలలో 3 సెంట్లు ఇస్తామని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పాడు.. కానీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వలేదని విమర్శించారు. దాదాపు 76 హామీలు ప్రజలకు ఇచ్చాడు. ఇప్పుడు ఏదో నాలుగు సంక్షేమ పథకాల అమలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చ వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ సిపిఐ మండల కార్యదర్శి నాగరంగయ్య రైతు సంఘం నాయకులు వీటి. రామాంజనేయులు, నారా యణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పుట్టినరోజు

విశాలాంధ్ర-శింగనమల : మండల కేంద్రంలోని ఆత్మ రామస్వామి దేవాల యంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జన్మదినం సందర్భంగా టీడీపీ నాయకులు కార్యకర్తల సమక్షం లో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనునిత్యం ప్రజా శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో శింగనమల అభివృద్ధేధ్యేయంగా పనిచేస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు చేరవేసి సుపరిపాలన అందిస్తున్న ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.

నియోజక వర్గ అభివృద్ధే శ్రావణి శ్రీ ధ్యేయం

విశాలాంధ్ర-శింగనమల (పుట్లూరు): ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పుట్టినరోజు సందర్భంగా పుట్లూరు మండలం కడవకల్లు టీడీపీ నాయకుడు గోవర్ధన్ రాజు ఆధ్వర్యంలో రమణ మహర్షి అనాధ ఆశ్రమంలో అనాధలతో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం గోవర్ధన్‌రాజు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా శ్రేయస్సు ధ్యేయంగా నియోజక వర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తుందన్నారు, యువ నాయకురాలు బండారు శ్రావణి శ్రీ కలకాలం నిండు నూరేళ్ల సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. అనంతరం 130 మంది అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు.

రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటా

ప్రమాణ స్వీకారంలో ... బొల్లు శ్రీనివాస్ రెడ్డి

విశాలాంధ్ర-పామిడి: పట్టణంలో సింగిల్ విండో అధ్యక్షుల వడ్డే డైరెక్టర్ ప్రమాణ స్వీకారోత్సవాలు పండుగ వాతావరణంలో కొనసాగింది. ఆదివారం ఉదయం ఎన్టీఆర్ సర్కిల్ నుండి రామవత్ ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా వెళ్లి సింగిల్ విండో అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరెడ్డి ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వడ్డే డైరెక్టర్ పద్మావతి ప్రమాణం స్వీకరం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏడిసిసి బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పామిడి, గుత్తి మండలం గుమ్మనూరు ఈశ్వర్, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు బొల్లు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రైతులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి వారి అభివృద్ధికి కృషిచేస్తామని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అవకాశం ఇచ్చినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, సోమవారం 4,ఆగస్టు 2025

ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధం

- పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించడం దారుణం
- ప్రభుత్వ ఉత్తర్వులను దగ్ధం చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్యసాయి: విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులను అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) శ్రీ సత్య సాయి జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర తీవ్రంగా ఖండించారు. పుట్టపర్తిలోని గణేష్ సర్కిల్ లో ఉత్తర్వులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యా రంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తాయని. ఈ పద్ధతిలో విద్యార్థి సంఘాలపై నిషేధం విధించడం ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్య అని ఆరోపించారు. ప్రధానంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలలన్నీ కూటమి ప్రభుత్వ నాయకులవేనని శ్రీ చైతన్య నారాయణ భాష్యం ఈ పాఠశాలల ఫీజుల దోపిడీని పుస్తకాలను అధిక ధరలు అమ్మకోవడానికీ, విద్యను వ్యాపారం చేసుకోవడానికి వారు మేలుకోసమే ఉత్తర్వులని అన్నారు. ఈ ఉత్తర్వులు విద్యార్థి హక్కులపై దాడిగా భావిస్తూ, తక్షణమే వెనక్కి తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన విద్యార్థి ఉద్యమాలు చెప్పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హర్షవర్ధన్, సాయి ప్రతాప్, శివ భరత్, దినేష్, కార్తీక్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాల్సిందే..

విశాలాంధ్ర-హిందూపురం : ప్రభుత్వ ఉత్తర్వులు ప్రజాస్వామ్య విరుద్ధమని, ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు తప్పవని ఏఐఎస్ఎఫ్ నాయకులు హెచ్చరించారు. పాఠశాలల్లో విద్యార్థి సంఘాల ప్రవేశాన్ని నిషేధించడం దారుణం అన్నారు. ఆదివారం అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన వ్యక్తం చేసి, ప్రభుత్వ ఉత్తర్వులను దగ్ధం చేశారు. విద్యార్థుల హక్కులను హరించేలా పాఠశాలల్లో విద్యార్థి సంఘాలు ఇతర రాజకీయ పార్టీలు ప్రవేశించకుండా నిషేధిస్తూ ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఉత్తర్వులను ఏఐఎస్ఎఫ్‌గా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరసింహ మూర్తి మాట్లాడుతూ, విద్యార్థి సంఘాలు రాజకీయం కోసం కాదని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, హక్కుల కోసం, విద్యా రంగంలో ఉన్న అన్యాయాలపై పోరాటాలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలన్నీ కూటమి ప్రభుత్వ నాయకులవేనని శ్రీ చైతన్య నారాయణ భాష్యం ఈ పాఠశాలల ఫీజుల దోపిడీని పుస్తకాలను అధిక ధరలు అమ్మకోవడానికీ, విద్యను వ్యాపారం చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. అన్నారు. విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, ప్రజా జీవితంపై అవగాహన, హక్కులు బాధ్యతలను విద్యార్థి సంఘాలు తెలియచేస్తాయని నరసింహ మూర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చంద్రశేఖర్, మొహమ్మద్‌అలీ, వినీత్, కళాందర్, ప్రభాకర్, దీపక్, కార్తీక్, వర్ధన్, సిద్ధార్థ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయం

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి

విశాలాంధ్ర-ధర్మవరం : గ్రామాల సమస్యలను పరిష్కరించడమే మా ధ్యేయమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలో గ్రామస్తులతో కలిసి పర్యటించారు. అక్కడ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, సమస్యలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో సిసి రోడ్ల కొరత మౌలిక సదుపాయాలపై గ్రామస్తుల విన్నపాలను స్వయంగా స్వీకరించారు. తప్పకుండా ఈ గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వం ద్వారా పరిష్కరించే దిశగా తాను చర్యలు వెంటనే చేపడుతానని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ జడ్పీ అధ్యక్షులను పరామర్శ... మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన మాజీ జడ్పీ అధ్యక్షులు చిగిచెర్ల ఓబిరెడ్డి ఇటీవల మోకాళ్ళ నొప్పికి చికిత్స పొందుతూ ఇంటికే పరిమితమయ్యారు. సమాచారాన్ని అందుకున్న జన సేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక్క మధుసూదన్ రెడ్డి స్వయంగా ఓబిరెడ్డి స్వగృహానికి వెళ్లి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు.త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన వారికి మంత్రి అభినందన

విశాలాంధ్ర-పెనుకొండ: కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసం ద్వారా ఏ విజయాన్ని అయ్యిన సాధించవచ్చని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖమంత్రి సవితమ్మ అన్నారు. ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 25 మందికి పైగా సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందారు. వారిని పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో సవితమ్మ , ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకొని, నిరంతరంగా శ్రమించి తల్లిదండ్రులకు కలలు నెరవేర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

స్మార్ట్ మీటర్లు బిగించరాదు... విద్యుత్ ఛార్జీలు పెంచరాదు..

సీపీఐ, సీపీఎం నాయకుల డిమాండ్

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగించరాదని విద్యుత్ ఛార్జీలను పెంచరాదని సిపిఎం సిపిఐ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని సిపిఎం పార్టీ ఆఫీస్ నందు విలేకరులతో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు పెద్దన్న, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం. మధు, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్హెచ్ భాష ,పట్టణ కార్యదర్శ లు ఏ మారుతి, రవి, సిఐటియు నాయకులు జె వి రమణ, అయూబ్ కాన్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీల పిలుపుమేరకు ఈనెల 5వ తేదీన పట్టణంలోని విద్యుత్ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించరాదని పేద, మధ్య తరగతి కుటుంబాల పైన, రైతుల పైన విద్యుత్ ద్వారాలు పెంచరాదని తెలిపారు. ముఖ్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఎన్నికల ప్రచారాల సందర్భంగా వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించి రైతులకు ప్రజలకు మోయ లేని భారాలు వేసిందని, గతంలో బాదుడే బాదుడని నినాదాలతో రైతులకు ప్రజలకు మా అధికారం రాగానే బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగిస్తామని, అదేవిధంగా స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని నారా లోకేష్, సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారని, కానీ అధికారం వచ్చి సంవత్సరం పైబడిన గతంలో బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగించలేదు అని మండిపడ్డారు. అదేవిధంగా ఇప్పటికే పట్టణాలలోని అనేక షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించి, వ్యాపారాలు లేక వ్యాపారులు అనేక రకాలు ఇబ్బందులకు గురవుతుంటే మూలిగే నక్కపైన తాటికాయ పడ్డట్టు మరింతగా భారంపడేటట్లు స్మార్ట్ మీటర్ బిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేస్తున్నదని, చెప్పిన హామీలు ఎక్కడికెళ్ళినాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో పెంచిన విద్యుత్ చార్జీలను సంవత్సరంలోపే పెంచి రైతులకు, ప్రజలకు మోయలేని భారం వేసినదని మండిపడ్డారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం మానుకోవాలని లేకుంటే పోరాటాలు పునరావృతం అవుతాయని హెచ్చరించారు. ఈనెల 5 జరగబోయే కార్యక్రమానికి రైతులు, ప్రజలు వ్యాపారస్తులు కలసి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

5న జర్నలిస్టుల డిమాండ్స్ డేగా పాటించాలి

ఏపీయూడబ్ల్యూజే..

విశాలాంధ్ర-ధర్మవరం : ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆగస్టు 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లా కేంద్రాలు, రెవిన్యూ డివిజన్లతో పాటు మండల కేంద్రాలలో డిమాండ్స్ డేగా పాటించాలని రాష్ట్రకమిటీ పిలుపు ఇచ్చిందని పట్టణ ఏపీయూడబ్ల్యూజే నాయకులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ మేరకు రాష్ట్రంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కేంద్రంలో కలెక్టర్, డివిజన్ కేంద్రాలలో రెవిన్యూ డివిజన్ అధికారులకు, మండల కేంద్రాలలో తాహసీల్దారుల కార్యాలయం వద్ద నిరసన తెలియజేసి అనంతరం వినతిపత్రాలను అందివ్వాలని కమిటీ పిలుపునిచ్చింది అని తెలిపారు. ప్రతి ఒక్క జర్నలిస్టు డిమాండ్స్ డేలో పాల్గొని సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని జిల్లా కమిటీ, ధర్మవరం రెవెన్యూ డివిజన్ కమిటీ విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలకు బ్రాహ్మణ సంఘం కృతజ్ఞతలు

విశాలాంధ్ర-రొళ్ల : కూటమి ప్రభుత్వం సంఖ్యాపరంగా తక్కువ ఉన్న బ్రాహ్మణులను గుర్తించి బ్రాహ్మణుడైన సీనియర్ టీడీపీ నాయకుడు గురుమూర్తిని మడకశిర మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు మడకశిర బ్రాహ్మణ సంఘం తరుపున బ్రాహ్మణ నాయకులు కలిసి ఎమ్మెల్యే టీటీడీ బోర్డు మెంబర్ ఎం.ఎస్.రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ సందర్భంగా పోటీ ప్రపంచంలో బ్రాహ్మణులను గుర్తించి,కీలకమైన పదవీ కట్టబెట్టడం చూస్తే తెలుగుదేశం పార్టీకి, టీడీపీ అధినాయకుడు నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ స్థానిక నాయకులకు బ్రాహ్మణుల మీద ఉన్న గౌరవం, విశ్వాసానికి నిదర్శనమని కొనియాడారు. బ్రాహ్మణ సముదాయ భవనంలో శ్రీవారి కళ్యాణోత్సవం జరిపి బ్రాహ్మణులందరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బి.ఎస్ గురుమూర్తిని ఘనంగా సన్మానించారు. బ్రాహ్మణులకు ప్రత్యేకంగా స్మశానవాటిక కు స్థలం కేటాయించి ఒక బోర్ వేయించాలని, బ్రాహ్మణులకు ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, అర్హులైన బ్రాహ్మణులకు పెన్షన్, రేషన్ కార్డు, పక్కా గృహాల మంజూరు చేయించాలని అనేక దేవాలయాల్లో అర్చకులుగా ఉన్న బ్రాహ్మణులకు ధూప దీప నైవేద్యం పథకాన్ని వర్తింప చేయాలని గురు మూర్తికి విజ్ఞప్తి చేశారు. సన్మాన సభలో గురుమూర్తి డిమాండ్లను శాసనసభ్యులు మాజీ శాసనమండలి సభ్యులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని, దేశంలోనే మొదటిసారిగా బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసి 500 కోట్ల రూపాయలు ఇచ్చి బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తున్న నారా చంద్రబాబు నాయుడుకి బ్రాహ్మణులందరు కృతజ్ఞతగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

కరెంటు సమస్యను పరిష్కరించిన మంత్రి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని 31వ వార్డు సత్యసాయి నగర్ కాలనీలో కొంతకాలంగా 'లో వోల్టేజి, కరెంట్ సమస్య వల్ల ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు, ఎల్ఈడి బల్బులు సరిగా పనిచేయకపోవడం వలన విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందిగా ఉండడం, రాత్రి వేళల ఎందు కాలనీ వాసులు బయట తిరగాలంటే వీధి లైట్లు సమస్య వలన ఇబ్బంది పడుతున్నారన్న విషయాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లగా సమస్యను విన్న మంత్రి సత్య కుమార్ యాదవ్ తక్షణమే సానుకూలంగా స్పందించి మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు ద్వారా 31 వ వార్డు సత్యసాయి నగర్ కాలనీలో ఒక డిపి ఏర్పాటు చేయాలని ఆదేశించడం వాటి పై వెంటనే మంత్రి ఇంచార్జ్ హరీష్ బాబు డిపి ఏర్పాటు చేయడం దీంతో వార్డు ప్రజలు, విద్యార్థులు, చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. అడిగిన వెంటనే సమస్య పరిష్కారం చేసిన మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, 31 వార్డ్ సత్యసాయి నగర్ బిజెపి నాయకులు. గాండ్లపర్తి మల్లికార్జున, బాలకర్ణ, శివశంకర్, బండ్లపల్లి రాజు, గిరక నాగేంద్ర, రాజశేఖర్, మహేష్, నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి వాటర్ వర్కర్స్ పోరాట ఫలితమే విజయం

ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్ కుమార్

విశాలాంధ్ర -హిందూపురం : హిందూపురం మున్సిపల్ పరిధిలోని కొట్నూరు పంప్ హౌస్ వద్ద గొల్లపల్లి వాటర్ వర్కర్స్ యూనియన్ సమావేశం యూనియన్ కార్యదర్శి రాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎనిమిది నెలల జీతాలలో ఆరు నెలల జీతాలు పడినందుకు, అందుకు సహకరించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు, వారి వ్యక్తిగత కార్యదర్శులు శ్రీనివాసరావు, వీరయ్యకు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ విషయాన్ని ప్రజానీకానికి తెలియజేసి పలు కథనాలు రాసి కార్మికులకు న్యాయం చేకూరే వరకు గొల్లపల్లి కార్మికులకు అండగా నిలబడిన పత్రిక విలేకరులకు, మీడియా ప్రతినిధులకు ప్రత్యేకమైన ధన్యవాదాలని తెలిపారు. కార్మికులకు ఆప్కాస్‌లో చేర్చి రెగ్యులర్‌గా జీతాలు ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలని, కోరారు. కోట్నూరు పంప్ హౌస్‌కి రోడ్డు సౌకర్యం కల్పించాలని, గొల్లపల్లి పంప్ హౌస్‌లో లైటింగ్స్ ఏర్పాటు చేయాలని పలు సమస్యలను సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి హిందూపురం తాలూకా కార్యదర్శి మారుతీరెడ్డి, గొల్లపల్లి వాటర్ వర్కర్ యూనియన్ కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు హరి, ఉమేష్, మంజునాథ్, సహాయ కార్యదర్శులు తబ్జిల్, అభిషేక్, బాబు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పేదలకు కంటి వెలుగు ..

విశాలాంధ్ర-ధర్మవరం: పేద ప్రజలకు కంటి వెలుగును ప్రసాదించడమే మా ధ్యేయమని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర కార్యదర్శి ఆర్.జయరాం కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణములో (వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా) ఉచిత ఐఓఎల్ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం యువర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ.. శ్రీ సత్య సాయి జిల్లా, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి-బెంగళూరు వారి సహాయ సహకారములతో నిర్వహించామని 75 మంది కంటి రోగులు పాల్గొనగా అందులో వైద్యులు వైద్య చికిత్సలను అందించగా 46 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో క్యాంపు చైర్మన్ షేక్ సికిందర్, సుకుమార్, కేతాలోకేష్, పోలా ప్రభాకర్, సీకే రామాంజనేయులు, చాంద్ బాషా, నేత్ర జ్యోతి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్ర దర్శనాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 9వ తేదీ పౌర్ణమి సందర్భంగా అరుణాచలం, గిరి ప్రదర్శన, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనార్థం ధర్మవరం ఆర్టీసీ డిపో నుండి ఈ నెల 8వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేయడం జరిగిందని డిపో మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ రాను పోను చార్జీలు 1400 రూపాయలు మాత్రమేనని తెలిపారు. దర్శనానికి వెళ్లవలసిన భక్తాదులు ఆన్లైన్లో గాని, బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్లో గాని, సీట్లను రిజర్వేషన్ చేసుకునే అవకాశం కలదని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9959225859కు సంప్రదించాలని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని చెన్నై కొత్తపల్లిలోని సిఎస్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో రెండు ఉచిత వైద్య శిబిరాలకు విశేష స్పందన రావడం పట్ల ధర్మవరం స్పందన హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా కృతజ్ఞతలను తెలియజేశారు. ఊపిరితిత్తులు, చాతి జబ్బుల వైద్య శిబిరమును ప్రముఖ వైద్యులు డాక్టర్ కే పూర్ణచంద్ర (పల్మ లాలజిస్ట్), చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మహమ్మద్ గౌస్, డాక్టర్ రితిక్ రవీంద్ర లచే 234 మంది రోగులకు ఉచితంగా వైద్య చికిత్సలను అందిస్తూ, ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించినట్లు తెలిపారు. ఉచితంగా వైద్య చికిత్సలు అందించి మందులు కూడా పంపిణీ చేశామన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా అర్హులైన చిన్న పిల్లలకు ఉచితంగా అడ్మిషన్ చేసుకొని ఉచిత వైద్య చికిత్సలు అందించడం జరిగిందని తెలిపారు. అలర్జీలు, తుమ్ములు, తగ్గు, ఆస్తమా, క్షయ, ఊపిరితిత్తులలో నీరు చీము చేరిన వారికి చికిత్సలు అందించారు. పురిటి పిల్లలు చిన్న పిల్లల వైద్య నిపుణులు మహమ్మద్ గౌస్ చే విష జ్వరాలు జలుబు కామెర్లకు ఉచితంగా చికిత్సలను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పందన హాస్పిటల్ మేనేజర్ బాబా ఫక్రుద్దీన్, సిబ్బంది దిల్దార్, నర్సులు పాల్గొన్నారు.

ఆకుతోటపల్లిలో ఉచిత గుండె వైద్య శిబిరం..

విశాలాంధ్ర-ధర్మవరం: మండల పరిధిలోని ఆకుతోటపల్లి గ్రామంలో గ్రామస్తులకు ఆదివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించామని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సొసైటీ సామాజిక విభాగం సలహాదారులు డాక్టర్ సత్య నిర్ధారన్ తెలిపారు. గ్రామంలో 20 మందికి హిమోగ్లోబిన్ రక్తపరీక్ష, రక్తపోటు పరీక్ష, ఇంటింటికి వెళ్లి నిర్వహించామని తెలిపారు. రక్తం తక్కువగా ఉన్నవారికి, గుండె జబ్బులు ఉన్నవారిని గుర్తించి వైద్య శిబిరం ద్వారా వాళ్లకు చికిత్సను కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ అధ్యక్షులు అండ్ వ్యవస్థాపకులు డాక్టర్ సోమలరాజు శివరాజ్ ఆదేశాల మేరకు నిర్వహించామని తెలిపారు. ఇంటింటికి పరీక్ష ఆరోగ్య కార్యకర్త అరుణ ఈసీజీని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిబిరా నిర్వాహకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందాం..

విశాలాంధ్ర-ధర్మవరం: ఈనెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు పట్టణంలోని కదిరి గేటు వద్ద గల నేతన్న విగ్రహం వద్ద జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుందామని చేనేత ఐక్యవేదిక నాయకులు దాసరి శ్రీరాములు, సంకారపు జయశ్రీ, గిర్రాజు రవి, యుగంధర్, పోలా వెంకటనారాయణ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏడవ తేదీని అధికార పూర్వకంగా చేనేత దినోత్సవంగా ప్రకటించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ వేడుకలకు సంబంధించి మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా ప్రత్యేక శ్రద్ధ కనపరిచారని తెలిపారు. దేశస్థాయిలో జాతీయ చేనేత దినోత్సవం గా నిర్వహించడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. చేనేతలందరూ ఐక్యతను చాటుకునే రోజుగా భావించి పట్టణంలోని చేనేత కార్మికులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. అంతేకాకుండా సీనియర్ చేనేత కార్మికులకు (మహిళలు, పురుషులు) చేనేత దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించే కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు. పట్టు చేనేత దినోత్సవాన్ని పండుగ రోజుగా ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని సూచించారు.

మానసిక శక్తి లేకనే కేసులు, గొడవలు

విశాలాంధ్ర బ్యూరో-శ్రీ సత్య సాయి : మానసిక శక్తిని కోల్పోవడం వలన కేసులు గొడవలు జరుగుతాయని, స్థిరమైన ఆలోచన ఉండాలంటే ప్రాణయామం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ ఇండియా నేషనల్ సీనియర్ సెక్రెటరీ డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నాడు. ఐ హెచ్ ఆర్ సి ఇండియా వారి ఆదేశాల మేరకు ధర్మవరం సబ్ జైల్లోని ఖైదీలతో మాట్లాడి వారికి మానసిక ప్రశాంతతను చేకూర్చే విధంగా యోగా ప్రాణయామం.. ధ్యానం లాంటివి నేర్పించాలని ఆయన పేర్కొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాయామం వల్ల మనిషిలో విజ్ఞత పెరిగి తప్పు నిర్ణయాలు తీసుకోకుండా ద్వేషాలకు అసూయాలకు కుట్రలకు పోకుండా ఉంటారని సబ్ జైల్లోని ఖైదీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ఆర్‌సి ఎన్‌డిటి స్టేట్ యూత్ ప్రెసిడెంట్ నితీష్ చౌదరి పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై సస్పెన్షన్ వేటు..

విశాలాంధ్ర-ధర్మవరం : ఈనెల 2వ తేదీ శుక్రవారం మండల పరిధిలోని ఆర్ ఎర్రగుంటపల్లి రేషన్ షాపులో 35 కిలోల బియ్యం వేయాల్సి ఉండగా 30 కిలోలే పంపిణీ చేయడంతో లబ్దిదారులు డీలర్ చెన్నారెడ్డి తో వాగ్వివాదం అయిన సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో రెవెన్యూ అధికారులు విచారణ నిమిత్తం ఆర్ ఎర్రగుంటపల్లిలోని రేషన్ షాప్‌లో లబ్ధిదారుల ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విచారణలో 5 కిలోలు తక్కువ వేయడం వాస్తవమేనని జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి వంశీ రెడ్డి తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చిన వాస్తవాలు నిజమేనని తెలియజేస్తూ స్వయంగా చెన్నారెడ్డి రాజీనామా ఇవ్వడంతో వీఆర్వో కేశవాకు ఇన్చార్జ్ అప్పజెప్పడం జరిగిందని తెలిపారు. డీలర్ షిప్ భావన పేరు మీద డీలర్ షిప్ ఉండగా నామినీగా చెన్నారెడ్డి నిర్వహిస్తున్నారని తెలిపారు. తదుపరి భావన రిజైన్ చేశారని తెలిపారు. చెన్నారెడ్డి సోషల్ మీడియాలో స్వయంగా 5 కేజీలు తక్కువగా ఎమ్మార్వో ఇవ్వమన్నాడు అన్నది అవాస్తవమని స్పష్టం చేశారు. అధికారుల మీద తప్పుడు ప్రచారాలు చేస్తే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మార్వోలకు తగిన ఆదేశాలు కూడా ఇస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మవరం సిఎస్డిటి చెన్నకేశవ నాయుడు, ముదిగుబ్బ సి ఎస్ డి టి మునుస్వామి, గురు ప్రసాద్, వీఆర్వో మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

పాముదుర్తి అగ్రహారం జట్టు విజేత

విశాలాంధ్ర-బత్తలపల్లి: కోడేకండ్ల గ్రామంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఈ మ్యాచ్‌లో పాముదుర్తి అగ్రహారం జట్టు శివంపల్లి జట్టుతో తలపడింది. చివరి వరకు హోరాహోరీగా సాగిన ఈ పోరులో పాముదుర్తి అగ్రహారం జట్టు 5 పరుగుల స్వల్ప తేడాతో శివంపల్లిపై విజయం సాధించింది. విజేతగా నిలిచిన పాముదుర్తి అగ్రహారం జట్టుకు రూ. 15,000 నగదు బహుమతితో పాటు విన్నర్స్ కప్‌ను బహుకరించారు. ఈ బహుమతులను అంద్రా మోహన్ నాయుడు చేతుల మీదుగా అందజేశారు. పరాజయం పొందినప్పటికీ శివంపల్లి జట్టు కూడా అద్భుతమైన పోరాట పటిమను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ టోర్నమెంట్ గ్రామంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే కాకుండా యువకులలో ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు, పాల్గొన్న క్రీడాకారులకు అభినందనలు వెల్లువెత్తాయి.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలోని మహమ్మదాబాద్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపాన ధర్మవరం నియోజక వర్గం నాగలురుకి చెందిన గని శెట్టి రాజేష్ (36) అనుమానాస్పద స్థితిలో చనిపోయాడు. గ్రామస్తులు అమడగూరు పోలీస్ స్టేషన్ సిబ్బందికి సమాచారాన్ని తెలియజేయగా ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతునికి గత ఏడు సంవత్సరాల క్రితం పెళ్లయిందని గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు ఏర్పడి విడివిడిగా ఉంటున్నారని మృతిని తమ్ముడు బాలచంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ తెలిపారు.

పాలిటెక్నికల్ కళాశాలలో 5న స్పాట్ అడ్మిషన్లు..

విశాలాంధ్ర-కదిరి : మండల పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళా శాలలో ఆగస్టు 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రమ తెలిపారు. కళాశాలలో ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ కోర్సుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు ఆగస్టు 4వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. క్యాటగిరి వారిగా రూ.6000ల వరకు ఫీజు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు అందరూ ప్రవేశానికి అర్హులేనని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.రమ తెలిపారు.

8 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర-కదిరి : కదిరి రూరల్ ప్రాంతంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి రూ.72,230 నగదు 8 మందిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివన్నారాయణస్వామి తెలిపారు. ఆదివారం ఎస్పీ వి.రత్న ఐపీఎస్ ఆదేశాల మేరకు రూరల్ పరిధిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి 8మందితో పాటు 8 ద్విచక్ర వాహనాలు,6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని జూదరులపై కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ తెలిపారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, సోమవారం 4,ఆగస్టు 2025

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం..

విశాలాంధ్ర-పామిడి: ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో పామిడి మండలం పరిధిలోని పి.కొండాపురం గ్రామంలో రక్తదాన శిబిరం ఆదివారం ఉదయం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.రెడ్ క్రాస్ సంస్త డాక్టర్ నిఖిల్, డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని దానాల కంటే రక్తదానం గొప్పది అన్నారు, రక్తదానం చేయటం వల్ల కలిగే లాభాలను ప్రజలకు తెలియజేశారు ఆరోగ్యమైన 23 మంది ప్రజలు రక్తదానం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవన్ కుమార్. మూర్తి, హరికృష్ణ, సరళ, రఘువీర్, పట్రా శ్రీనివాసులు, శిక్షావలి, మురళీకృష్ణ, శాంతి ప్రియ, తూర్పుంటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యోగ సాధనతో ప్రశాంతత

విశాలాంధ్ర-ఉరవకొండ: యోగ సాధన తో మానసిక ప్రశాంతతతో పాటు పరిపూర్ణమైన ఆరోగ్యం పొందవచ్చని గవి మఠం ఉత్తరాధికారి కరి బసవ రాజేంద్ర స్వామి అన్నారు. ఆదివారం ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ సెంట్రల్ హైస్కూల్లో జిల్లాస్థాయి యోగ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో యోగ సాధకులు హాజరయ్యారు. ఈ పోటీలు యోగాలో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించారు. జిల్లా స్థాయి యోగా పోటీల కార్యక్రమానికి యోగ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, స్థానిక యోగ కార్యదర్శి వెంకట్, ఆయుర్ అధ్యక్షులు చంద్రశేఖర్, మారుతి ప్రసాద్, బద్రీనాథ్, నాగభూషణ, దివాకర్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఆక్సిజన్ సరఫరా పరికరం వితరణ

విశాలాంధ్ర-తాడిపత్రి: కార్పెంటర్ కుటుంబానికి ఆక్సిజన్ సరఫరా పరికరం వితరణ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కిషోర్ కుమార్ చెప్పారు. ఆదివారం ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు కిషోర్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని చిన్న బజార్, బుధవారం అమ్మయ్య గుడి సమీపంలో ఉన్న దాదాపీర్ అనే కార్పెంటర్ తల్లికి ఆక్సిజన్ సరఫరా పరికరం లేక ప్రతిరోజు 500 రూపాయలు వరకు ఆక్సిజన్ సిలిండర్ బయట నుంచి తీసుకుని వచ్చి సమకూర్చుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే వాడని తమకు తెలిసింది. దీంతో తమ వంతు సహాయంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నగదు35వేల విలువైన ఆక్సిజన్ పరికరం అందించినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ సభ్యులు మద్దిలేటయ్య, మురుగన్ బాలసుబ్రమణ్యం, షాకీర్ భాష, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వర్షాలు కోసం కాటమయ్య స్వామికి ప్రత్యేక పూజలు



విశాలాంధ్ర-యాడికి : మండల పరిధిలోని దైవాలమడుగు గ్రామంలో ఆదివారం గ్రామ ప్రజలు, రైతులు వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని దైవాలమడుగు గ్రామంలో కాటమయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేసి, త్రాగు నీరు లేకుండా పులగం, కారంతో భోజనాలు చేసి వరుణ దేవుడు కరుణించాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు, ఈ కార్యక్రమంలో రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాగుల పురదయస్వామి పట్టాభిషేకం మహోత్సవ ర్యాలీ



విశాలాంధ్ర-ఉరవకొండ : పట్టణంలో ఆదివారం కురువ కులస్తులకు చెందిన రాజగిరి గోత్రం(అండేల) వారు నిర్వహించిన నాగులపు రదయ స్వామి మహా సామ్రాజ్య పట్టాభిషేకం మహోత్సవ ర్యాలీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీరప్ప స్వాములు ఊరేగింపు, గంగపూజ, నూతన పూజారి నిర్మాణం, నల్ల కమ్మడి పూజ, గురవయ్యో లకు పాలు తాపుట లాంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుబ కులస్తులకు చెందిన బంధుమిత్రులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ అయ్యప్ప స్వామి గుడి వద్ద ఆదివారం సంతకు వచ్చిన గ్రామీణ వాసులకు, పేదలకు,యాచకులకు, నారాయణ సేవలో భాగంగా సుమారు 200 మందికి అన్నదానం, తాగునీరు అందజేశారు. దాతలు సహకరించి మాకు సేవా భాగ్యం కలిగించిన వీరికి, వీరి కుటుంబ సభ్యులకు, భగవాన్ సత్యసాయి బాబా వారి అనుగ్రహం కలిగి ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు.

ఆస్పత్రి సిబ్బంది ఆకస్మిక మృతి

విశాలాంధ్ర-పెనుకొండ : రొద్దం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసే గిరిధర్‌రావు మల్టీపర్పస్ హెల్త్ సిస్టంలో పని చేస్తున్న గిరిధర్‌రావు గుండెపోటుతో కర్నూలు హాస్పిటల్‌లో స్వర్గస్తులు అయినారు, ఆయనకు భార్య కుమారుడు ఉన్నారు, ఆయన మృతి వార్త తెలుసుకొని ఆశా వర్కర్లు ఆసుపత్రి సిబ్బంది పెద్ద ఎత్తున వచ్చిన నివాళులర్పించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవం.. ఊరేగింపు

విశాలాంధ్ర-బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ గ్రామంలో నీలకంఠేశ్వర దేవాలయం లో నందీశ్వర విగ్రహం, గోపుర కలశ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నంది విగ్రహంతో గంగపూజకు, డొల్లు మంగళవాద్యంతో గోపుర కలశాని ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో గ్రామ పురవీధుల నుండి ఆలయం వరకు, వైభవంగాఊరేగింపు నిర్వహించారు. గోమాత, నూతన నంది విగ్రహంతో శ్రీ నీలకంఠేశ్వర ఆలయ ప్రవేశం, కలశ జలధివాస, క్షీరాదివాస, ధాన్యాదివాస, సాయంత్రం మహా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహ, నంది సమారాధన, నవగ్రహ పూజ, అష్టదీక్షలాకార పూజ, గణహోమం, రుద్ర హోమం, రుద్రహోమం, రుద్రహోమం, రుద్రహోమం, రుద్రహోమం, మహా గణపతి పూజలు నిర్వహించారు.. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం 5.00 గంటల నుండి శ్రీ నీలకంఠేశ్వర, నందీశ్వర గోపుర కాలాలకు రుద్రాభిషేక, బిల్వార్చన, ప్రాణ ప్రతిష్ఠాపరణ కలశారోహణ, మహా మంగళారూతి, గురువుల ఆశీస్సులు, మహాప్రసాద వితరణ. కార్యక్రమాలు ఉంటాయి.

విద్యార్థులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఉన్న న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో స్నేహితుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు లయన్స్ లియో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థుల యూనిఫామ్ పుస్తకాల కొరకు లయన్స్ క్లబ్ సభ్యులు రాజకుమార్ చేతల మీదుగా ఎనిమిది మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 5000 రూపాయలు అందించారు. అనంతరం లయన్ క్లబ్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలకు న్యూ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉచిత విద్యనందిస్తున్న కరస్పాండెంట్ రామకృష్ణను అభినందించారు. లయన్ ఇస్మాయిల్, లయన్ రామ్మోహన్ రెడ్డి, లయన్ చల్లా సూర్యనారాయణ పాల్గొన్నారు.

మొబైల్ మత్తులో చిన్నారులు..!

మొబైల్ లేనిదే ముద్ద ముట్టని పసిప్రాయం..!



విశాలాంధ్ర-కదిరి : మొబైల్ మత్తులో బాల్యం చిక్కి బందీ అవుతోందని మేధావులు పేర్కొంటున్నారు. 5ఏళ్ల లోపు పిల్లలు ఫోన్ ఇవ్వనిదే ఏడుపు ఆపడం లేదు, అన్నం తినడం లేదు, పాఠశాలకు వెళ్లడం లేదు. ఉదయం సాయంత్రం అన్న తేడా లేకుండా పిల్లలు కార్టున్ బొమ్మలు చూపించకుంటే గోరు ముద్దలు తినడం లేదు.మొబైల్ ఇవ్వకుంటే మారం చేస్తారు. కోపగించుకుంటే అలిగి మూలన కూర్చుం టారు. దీంతో తల్లిదండ్రులు చేసేది లేక మొబైల్ ఫోన్ ఇస్తూ వారికి తెలియకుండానే బాల్యాన్ని బందీ చేస్తున్నారు. మొబైల్ అతిగా వినియోగించి కంటి జబ్బులు తెచ్చుకుంటున్నారు. ఇంటికి రాగానే ఒకటి రెండు తరగతులు చదివే చిన్నారులు బడి నుండి సాయంత్రం ఇంటికి రాగానే చేతిలో సెల్‌ఫోన్ ఉండాల్సిందే. లేదంటే ఇంట్లో ఒక్కటే గొడవలు తట్టుకోలేక సెల్‌ఫోన్ చేతికిస్తే దానిని అలుసుగా తీసుకొని క్యాండీ క్రష్,క్యారం బోర్డ్, పబ్జి గేమ్ ఆడుతూ సెల్ కు అతుక్క పోతున్నారు.ప్రస్తుతం పిల్లల పరిస్థితి చూస్తుంటే ఏదయినా ఇన్స్టాగ్రామ్,ఫేస్ బుక్ చూసే సమయంలో పిల్లలను పిలిచినా, ఫోన్ తీసుకున్నా.. కోపంలో సెల్‌ఫోన్ విసిరివేయడంతో పాటు కోపంతో రగిలి పోతున్నారు. పాఠాలు నేర్పించాల్సిన ఉపాధ్యాయులే హెూమ్ వర్కుల పేరిట వాట్సాప్‌లో పంపిస్తూ మొబైల్ ఫోన్‌ని ఇంకా దగ్గర చేర్చుతున్నారనే విమర్శలు లేకపోలేదు.

అతిగా వాడితే అంతే సంగతి.. చిన్నారులకు మొబైల్ ఫోన్ ఇచ్చి వారి విలువైన జీవితం నాశనం అవుతుందని తల్లిదండ్రులు గుర్తించాలని కంటి వైద్య నిపుణులు సూచిస్తున్నారు. 5సంవత్సరాల నుండి 15సంవత్సరాల పిల్లలు రోజుకు గంట కంటే ఎక్కువ సేపు స్క్రీన్ చూస్తే తలనొప్పి,కంటి చూపు మందగిస్తుందని తెలిపారు. కొన్ని సమయాల్లో అసభ్యకర వీడియోలు చూసి యువత చిన్న వయసులోనే తప్పుదోవ పట్టే అవకాశం ఎక్కువ ఉందన్నారు.

ప్రజలకు న్యాయం చేయని చాతకాని కూటమి ప్రభుత్వం..

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ అర్బన్‌లోని ట్యాంక్ సర్కిల్ నందు బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో అనే కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా వైసీపీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, ఉషశ్రీ చరణ్ ఆవిష్కరించారు. సూపర్ సిక్స్ పథకాలంటూ మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, మరియు రైతులకు ఏ ఒక్క పంటకు నష్టపరిహారం చెల్లించలేని చేతకాని ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు.ఈ కార్యక్రమంలో పెనుకొండ మండల మరియు పట్టణ ప్రజాప్రతినిధులు కన్వీనర్ నరసింహ, కౌన్సిలర్లు సద్దాం, కొండల రాయుడు, చెన్నకేశవులు,వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారు..

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని లాలెప్ప కాలనీలో సమస్యలను జేసీ అభిమానులు, టిడిపి నాయకులు.. ఆదివారం పరిష్కరించారు. గత వారం రోజుల క్రితం సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా లాలెప్ప కాలనీలో టీడీపీ నాయకులు జేసీ అభిమానులు, పర్యటించినప్పుడు ఆ కాలనీలోని ప్రజలు, స్పీడ్ బ్రేకర్లు లేక యాక్సిడెంట్లు అవుతున్నాయని కావున కాలనీలో మూడు చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరగా, తక్షణమే స్పందించిన జేసీ అభిమాని విశ్వనాథ్ మిత్ర బృందం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు చోట్ల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు..కాలనీవాసులు శ్రీధర్, కిషోర్, గురు, విజయ్, నాగేంద్ర, కుందా లక్ష్మి నారాయణ, మధు, శివ హర్షం వ్యక్తం చేస్తూ, ఎన్నో సార్లు అధికారులకు అర్జీలు ఇచ్చినా సమస్య తీరలేదని, సమస్య చెప్పిన వారంలోపే తీర్చిన జేసీ అభిమానులకు, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలియ జేశారు.. అదేవిధంగా ఆ కాలనీలో ఉన్న కాలువను శుభ్రం చేసి, చిన్న చిన్న సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ, బీసీ సెల్ మండల కన్వీనర్ తిరంపురం నీలకంఠ, రామచంద్ర, సుభాన్, గుండా నారాయణస్వామి, వెంకట స్వామి, గన్నే రమేష్,పోలా రామాంజినేయులు, క్లస్టర్ ఇంచార్జ్ మాయకుంట్ల నారాయణస్వామి, పూలతోటరవి, రహమతుల్లా, చాంద్ బాషా, తిరుమలేష్, శివ, చందు,కరీం,మేకల రామాంజి, రమణ, లల్లూ పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న సినీ హీరోలు

విశాలాంధ్ర-కొత్త చెరువు: కొత్తచెరువుకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు మాజీ జెడ్పిటిసి చిన్నపోళ్ళ లక్ష్మీనారాయణ కుమారుడు సంతోష్ వివాహం సందర్భంగా రాష్ట్ర ఐటీ విద్య శాఖ మంత్రి నారా లోకేష్ బాబు నుంచి ప్రత్యేక గిఫ్టును పెళ్లి కానుకగా అందించారు. వారి వివాహం ఆదివారం హైదరాబాదులో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వివాహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి మంత్రి నారా లోకేష్ సతీమణి నారా బ్రాహ్మిణి తో పాటు సినీ హీరో నారా రోహిత్ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా హాజరయ్యారు. మంత్రి నారా లోకేష్ బాబు సింగపూర్ పర్యటన వల్ల వివాహానికి రాలేకపోయారు. నారా కుటుంబానికి... ఆ కుటుంబానికి ఉన్న స్నేహ సంబంధాల కారణంగా హైదరాబాదు నుంచి మంత్రి నారా లోకేష్ బాబు ప్రత్యేకంగా పంపించిన పెళ్లి కానుకను మామిళ్ళకుంట క్రాస్‌లో నూతనంగా నిర్మించిన ఎస్‌జి కన్వర్షన్ హాల్లో ఆదివారం నూతన వరుడు సంతోష్ వధువు ప్రియ కృష్ణలకు నిర్వహించిన వారు ప్రత్యేకంగా పంపించిన పెళ్లి కానుకను స్థానిక ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి లక్ష్మీనారాయణ చేతులమీదుగా ఈ పెళ్లి కానుకను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సినీ హీరోలు నారా రోహిత్, మంచు మనోజ్, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టీడీపీ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, ఎమ్మెల్యే పీఆర్వో సంతోష్ రెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శికి ఘన సన్మానం

విశాలాంధ్ర-ఉరవకొండ : ఎరుకుల కులస్తుల సమస్యలు మరియు వారి హక్కుల కోసం నిరంతరం పోరాటాల నిర్వహిస్తున్న ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి కోలే గుండ్ల శేఖర్ ను ఏపీ ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాస చక్రవర్తి, క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు మేడ గోపి ఆదివారం గుంటూరులో ఘనంగా సన్మానం చేశారు. ఎరుకుల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడానికి ఏర్పాటు చేసిన సమావేశానికి ఉరవకొండకు చెందిన కోల్లే గుండ్ల శేఖర్ హాజరయ్యారు. ఉరవకొండ నియోజకవర్గంలో త్వరలోనే ఎరుకుల కులస్తుల యొక్క ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

అంతకుముందు ఆయన విజయవాడలో ఎరుకుల సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరావును కూడా కలిసి ఆత్మీయ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఎరుక కులస్తులు రాజకీయ, విద్య ఉద్యోగాలలో రాణించాల్సిన అవసరం ఉందని పాలకులు కూడా ఎరుక కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని శేఖర్ తెలిపారు. ఎరుక కులస్తులందరూ వారి హక్కులను సాధించుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఉరవకొండలో త్వరలో నిర్వహించే ఆత్మీయ సమావేశానికి పెద్ద సంఖ్యలో రాష్ట్ర, జిల్లా నాయకులు తరలిరావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల అధ్యక్షులు వై.రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగరాజు, గుంటూరు ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వీరశైవ మహాసభకు తరలిన మండల వీర శైవులు...

విశాలాంధ్ర-కణేకల్లు: గుంతకల్లు లో ఆదివారం జరిగిన అఖిలభారత వీరశైవ మహాసభ కార్యక్రమానికి కనేకల్ మండల వీర శైవ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అఖిలభారత వీరశైవుల రాష్ట్ర సంఘ అధ్యక్షులు దండి శివానంద మాట్లాడుతూ వీరశైవ సామాజిక వర్గాన్ని ఓబీసీలో చేర్చాలని ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. వీరశైవులంతా క్రమశిక్షణతో ఏకతాటిపైకి ఉన్నప్పుడే ఏదైనా సాధించవచ్చునని సూచించారు, కార్యక్రమంలో వీర శివ మెంబర్స్ నటరాజ్, వేలూరు మరియప్ప, తిప్పే స్వామి, శరభన గౌడ్, మహేష్ గౌడ్, నాగరాజ్, వరదరాజు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

విశాలాంధ్ర-యాడికి : స్థానిక మార్కెట్ వీధిలో నివాసముంటున్న తెలుగుదేశం సీనియర్ నాయకులు మందాటి దేవేంద్ర నాయుడు మోకాలి ఆపరేషన్ చేయించుకొని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకొని, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, తెలుగుదేశం నాయకులు రవి కుమార్‌రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ, రవి కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ దడియాల ఆది, పరిమి శ్రీహరి. నెట్టికంటయ్య, మాజీ సర్పంచ్ గోపాల్ నాయుడు, రహంతుల్లా నాయకులు దేవేంద్ర నాయుడుని పరామర్శించి ఆరోగ్యంగా త్వరగా కోలుకొని పార్టీకి సేవలందించాలని కోరారు.

ఉద్యోగాలు సాధించిన వారికి సన్మానం

విశాలాంధ్ర-పెనుకొండ: రొద్దం మండల పరిధిలోని కందుకూర్లపల్లి లో గ్రామం నందు ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉప్పర ఆంజనప్ప ,(టీచర్)మరియు కురుబ విజయ్‌కుమార్ (పోలీస్) ఉద్యోగాలు సాధించినందున, మాజీ సర్పంచ్ అశ్వత్ నారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తులు, సమక్షంలో సన్మానం చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉన్న పద్మవాణి హైస్కూల్లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి. సంజీవరెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో విజ్ఞానాన్ని పెంపొందించి, నైపుణ్యతను పెంచడానికి లయన్స్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా విద్యార్థిని, విద్యార్థులు ఇలాంటి వ్యాసరచన పోటీల్లో పాల్గొని పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పోటీ పరీక్షలు అంటే భయం పోతూ, అనుభవం వస్తుందన్నారు. ఈ వ్యాసరచన పోటీలలో దాదాపు 473 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి టి.నారాయణస్వామి, రమేష్ నాథ రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజా నాయుడు, లక్ష్మినారాయణరెడ్డి, మహమ్మద్ రఫీ, వాణి, రాజేశ్వరి, హైమావతి, అనురాధ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.